www.samasamajam.in

RNI NO: TELTEL/2016/73311

SAMA SAMAJAM TELUGU DAILY

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : పృధ్వీరాజ్. జి   9581442622

శుక్ర వారం
10-02-2023
సంపుటి - 08,
సంచిక-255
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole




# పార్లమెంట్‌ను వీడని అదానీ ప్రకంపనలు

## జేపీసీ దర్యాప్తు కోరుతూ బీఆర్ఎస్ నిరసన




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (సమ సమాజం): అదానీ స్టాక్స్ మోసాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలని భారత్ రాష్ట్ర సమితి, ఆమ్ ఆద్మీ పార్టీలు గురువారం కూడా పార్లమెంట్‌లో డిమాండ్ చేశాయి. ఉభయసభలను బహిష్కరించిన ఇరు పార్టీలు.. పార్లమెంట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్, ఆప్ పార్టీ ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని గాంధీ విగ్రహం ముందు నినాదాలు చేశారు. అదానీ సంక్షోభంపై తేల్చేందుకు జేపీసీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మోసాలను ఇక సహించమని అన్నారు. ఆదానీ అక్రమాలపై నిగ్గు తేల్చాలని బిఆర్ఎస్ నేత కేశవరావు డిమాండ్ చేశారు. ఆదానీ 3వ పేజీలో...

# కరోనా సమయంలో వైద్యసిబ్బంది సేవలు నిరుపమానం

## వైద్యారోగ్యశాఖకు కేటాయింపులు పెరిగాయన్న గవర్నర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** కరోనా సమయంలో వైద్య సిబ్బంది అందించిన సేవలు వెలకట్టలేనివని గవర్నర్ తమిళిసై అన్నారు. క్యాన్సర్ అవేర్ నెస్ ప్రోగ్రాంను ప్రారంభించిన అనంతరం ఆమె రాజ్ భవన్ లో వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ ఫార్మా హబ్ గా మారిందని ప్రధాని మోడీ ప్రస్తావించడాన్ని గవర్నర్ గుర్తు చేశారు. వైద్యారోగ్య శాఖకు బడ్జెట్ లో రికార్డు స్థాయిలో రూ.12,161 కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. గతేడాదితో పోల్చితే రూ.721 కోట్లు ఎక్కువ కేటాయింపులు జరిగినందున ఇది ఆరోగ్య తెలంగాణ సాధనకు మరింత దోహదం చేస్తుందన్నారు. వైద్య రంగంలో మరిన్ని విప్లమాత్మక మార్పులు తీసుకురావాలని ఆశిస్తున్నట్లు చెప్పిన గవర్నర్.. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా జిల్లాకో నర్సింగ్ కాలేజీలు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా కూడా పేదలకు మెరుగైన చికిత్స అందుతోందని అన్నారు.

# ప్రగతిభవన్ పేల్చేస్తారా..! అసెంబ్లీలో కెటిఆర్ ఫైర్..!

## ఇదేనా కాంగ్రెస్ పార్టీ విధానం ● బడ్జెట్ పద్దల చర్చలో శ్రీధర్‌బాబుపై కెటిఆర్ అటాక్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు చేసిన ఆరోపణలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ధరణిని రద్దు చేయడం.. ప్రగతి భవన్‌ను బద్దలు కొట్టడం, బాంబులతో పేల్చే యాలనడం కాంగ్రెస్ విధానామా? అని కేటీఆర్ కాంగ్రెస్ సభ్యులను సూటిగా ప్రశ్నించారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ధరణి పోర్టల్‌తో రైతులు సంతోషంగా ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్మాసిటీలో ఒక్క సెంటు భూమి కూడా అమ్మలేదన్నారు. లేనిపోని ఆరోప ణలు చేసినందుకు క్షమాపణ లు చెప్పాలన్నారు. అంతకు ముందు స్పీకర్ పోచారం కూడా పదేపదే శ్రీధర్ బాబును హెచ్చరించారు. గత ఆరేండ్లలో 30 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయితే, ఈ ఏడాదిన్నర కాలంలోనే 23 లక్షల 92 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అన్ని సవ్యంగా జరిగితే ఎవరూ మాట్లాడరు. ఎక్కడో ఒక చిన్న లోపం జరిగితే భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారు. ఒకట్రెండు లోపాలు జరిగితే రాష్ట్రమంతా గందరగోళం



3వ పేజీలో...

# ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో వ్యక్తి అరెస్ట్

ఇడి అదుపులో చారియట్ మీడియాకు చెందిన

## రాజేష్ జోషి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో వ్యక్తి అరెస్ట్ అయ్యారు. వరుసగా రెండు రోజుల్లో ముగ్గురు అరెస్ట్ అయ్యారు. చారియట్ మీడియాకు చెందిన రాజేష్ జోషిని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. సౌత్ గ్రూపునకు రూ.31 కోట్ల నగదును బదిలీ చేయడంలో రాజేష్ జోషి కీలకంగా వ్యవహరించినట్లు 3వ పేజీలో...

# రాజ్యసభలో అరుదైన దృశ్యం

## చైర్మన్ సీటులో పిటి ఉష



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** రాజ్యసభలో గురువారం అరుదైన ఘటన జరిగింది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ అటెండ్ కాకపోవడంతో పీటీ ఉష రాజ్యసభకు అధ్యక్షత వహించారు. చైర్మన్ చైర్ లో కూర్చొని రాజ్యసభ సమావేశాలను నడిపించారు. దీనికి సంబంధించిన వీడియోను 3వ పేజీలో...

# కంటివెలుగు శిబిరంలో సిఎస్ పరీక్షలు

## అందరూ సద్వినియోగం చేసుకోవాలన్న శాంతికుమారి



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ఈ సందర్భంగా సీఎస్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ల సూచన మేరకు సీఎస్ కళ్లద్దాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ఈ గొప్ప కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం గొప్ప సామాజిక పథకం అన్నారు. ప్రపంచంలో ఎక్కడా కూడా ఇలాంటి పథకం అమలు కావడం 3వ పేజీలో...

# రాజ్యసభలో తీవ్ర గందరగోళం



ప్రధాని మోడీ ప్రసంగానికి తీవ్ర అంతరాయం

జెపిసి డిమాండ్‌తో పోడియం వద్ద ఆందోళన


ఎంతగగా బురద జల్లితే ..కమలం అంతగా వికసిస్తుంది

మోడీ ప్రసంగం కొనసాగిస్తూనే చురకలు

3వ పేజీలో...

# పాముకాటుకు గురై బాలిక మృతి

## ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యతన్న బిఎస్పీ



**వరంగల్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** జిల్లాలోని భట్టుతండా ప్రైమరీ స్కూల్‌లో పాముకాటుకు గురై బాలిక చనిపోయిన ఘటనపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మన ఊరు, మన బడి పథకం పేరిట కోట్ల రూపాయలు మెఘూర్పణం చేసి, పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెప్పుకున్న ఈ పాపం ఎవరిది 3వ పేజీలో...

# జింఖానాలో బిఆర్ఎస్ భారీ సభ

## మంత్రులు, ఎమ్మెల్యేలతో కెటిఆర్ సమీక్ష ● సభను విజయవంతం చేసేలా జనసమీకరణకు ఆదేశాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** బీఆర్ఎస్ పార్ట వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో అసెంబ్లీ హాల్‌లో గురువారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఈ నెల 17న జరిగే పరేడ్ గ్రౌండ్స్ సభపై మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ చర్చించారు. ఈ సభను విజయవంతం చేయాలని కేటీఆర్ ఆదేశించారు. భారీ జన సమీకరణపై మంత్రులకు, ఎమ్మెల్యేలకు కేటీఆర్ పలు సలహాలు, సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ 3వ పేజీలో...

# 12మందికి ప్రలోభాలపై చర్య తీసుకోండి



టిఆర్ఎస్‌లో చేరిన 12మందిపై డిజిపికి ఫిర్యాదు

ప్రలోభాలతోనే 12మందిని చేర్చుకున్నారన్న రేవంత్

**హైదరాబాద్,ఫిబ్రవరి 9 (సమ సమాజం):** ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్ఎస్ లో కలిసిన 12 మంది 3వ పేజీలో...

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు

## ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఇసి




**హైదరాబాద్,ఫిబ్రవరి 9 (సమ సమాజం):** తెలంగాణ, ఏపీలో ఖాళీకానున్న ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. తెలంగాణలో 3వ పేజీలో...

## సంపాదకీయం

# మోడీ మౌనం దేశానికి నష్టం !

దున్నపోతు మీద వర్షం పడ్డట్లుగా ..అన్న సామెత ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వానిక సరిగ్గా సరి పోతుంది. ఆదానీ కుంభకోణపై పార్లమెంటులో నిలదీస్తున్నా..చర్చించాలని కోరుతున్నా..జెపిసి విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నా..కనీసంగా కూడా మోడీ స్పందించడం లేదు. ఏ వేదిక నుంచి కూడా స్పందించడం లేదు. దేశంలో ఒక ఆర్థిక సంక్షభం ముంచుకుని వస్తుంటే దాని గురించి మాట్లాడే ధైర్యం లేని ప్రధానిగా మోడీ చరిత్ర కెక్కారు. దీనికితోడు ఆత్మస్తుతి...పరనింద అన్న విధానాన్ని ప్రధాని మోడీ బాగా వంటబట్టించు కున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే సందర్భంలో చేసిన ప్రసంగంలో ఇది స్పష్టంగా కనిపించింది. పదిలక్షల కోట్ల రూపాయల ప్రజాధనం ఆవిరైనా మాట్లాడని ప్రధానిగా మోడీని చూస్తున్నాం. గతంలో మన్మోహన్‌ను మౌనముని అని విమర్శించిన బిజెపి నేతలు ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. అందుకే ఒళ్లు మండి రాజ్యసభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే ఘాటు వ్యాఖ్యలే చేశారు. మౌనిబాబా అని తన అసహనం వ్యక్తం చేశారు. దేశంలోని పదిలక్షల సంపద ఆవిరైనా పట్టించుకోని ప్రధాని మనకు అవసరమా అని ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు చేశారు. అదానీ, మోదీ ఒకే నాణెళినికి ఉన్న బొమ్మా బొరుసులని ఆమె ఆరోపించారు. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయమని కోరుతూ రోజూ పార్లమెంట్ వేదికగా విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన 10 రోజుల్లోనే అదానీ ప్రపంచ ధనవంతుల జాబితాలో 2వ స్థానం నుంచి 22వ స్థానానికి పడిపోయారు. ఇది దేశంలో జరుగుతున్న ఓ విపరీత పరిణామ క్రమం. దీనిని స్టాక్ మార్కెట్ వ్యవహారంగా ముడిపెట్టి నిర్మలా సీతారామన్ తప్పించుకో చూస్తున్నారు. అదానీ సంస్థ అనేక ప్రభుత్వ రంగ సంస్థల నుంచి అప్పులు తీసుకుంది. అలాగే అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ రూ. 80 వేల కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఎస్‌బీఐ రూ. 27వేల కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.5,380 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.7 వేల కోట్లు పెట్టుబడులు పెట్టాయి. హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ సంస్థల షేర్లు 51 శాతం పడిపోగా, ఎల్ఐసీ రూ. 18 వేల కోట్లు నష్టపోయింది దీని ద్వారా ఎల్ఐసీ షేర్లు కొన్న, ఎల్ఐసీ పాలసీలు చేసిన చిరుద్యోగులు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్ట పోయారు. దీనిని ఆదానీ వ్యక్తిగత విషయంగా ఎలా చూస్తామో నిర్మలా సీతారామన్ చెబితే బాగుంటుంది. ఇది స్టాక్ మార్కెట్ వ్యవహారమని చేతులు దులిపితే ప్రజలు ఊరుకోవాలా..?పార్లమెంటుకు బాధ్యత లేదా..? అదానీ సంస్థల కారణంగా ఎల్ఐసీ లాంటి అనేక పీఎస్‌యూలు నష్టపోతున్నా ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారో ప్రజలకు సమాధానం ఇచ్చుకోవాలి. విపక్షాలు కోరుతున్నట్లుగా అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారించాల్సిందే. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై గంటన్నర మాట్లాడిన ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఎక్కడా అదానీ విషయం ప్రస్తావించ లేదు. అయితే రాహుల్ విమర్శలపై మాత్రం స్పందించారు. ఆయనను ఎద్దేవా చేసే ప్రయత్నం చేశారు. దేశం ఆర్థికంగా ప్రబలమైన శక్తిగా ఎదిగిందని డబ్బా కొట్టుకున్నారు. మోదీకి ప్రజలపై పట్టింపు లేదని, తన మిత్రులైన పారిశ్రామికవేత్తల పైనే ఎకువ పట్టింపు ఉందనే విషయం ఇప్పుడు మరోమారు స్పష్టం అయ్యింది. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తేవాల్సిన బాధ్యత ప్రధాని మోడీదే. మౌనంగా ఉంటూ తప్పించుకోవాలని చూస్తే ప్రజలు ఊరుకోరని గుర్తించాలి. ఇకపోతే మోడీ అధికారం చేపట్టాక దేశాన్ని అభివృద్ధి చేసి యువతకు బంగారు భవిష్యత్తు ఇస్తామని అరచేతిలో వైకుంఠం చూపించారు.ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. నిరుద్యోగం 45 సంవత్సరాల రికార్డు

దాటిపోయింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బంగారం,వెండి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. సామాన్య ప్రజల ఆదాయాలు కుంచించుకు పోతున్నాయి. ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటంలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ దాడికి అండగా నిలబడింది. సహజ వనరులను యథేచ్ఛగా దోచుకోవటానికి అండగా నిలిచారు. అయితే అన్ని రకాల దోపిడీలపై ప్రజా ఉద్యమాలు వస్తూనే ఉన్నాయి. పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు ఆటంకంగా మారుతున్నా పటట్‌ఇంచుకోవడం లేదు. చారిత్రాత్మక రైతు ఉద్యమం మొదలుకొని ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాలు,విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం, విద్యార్థుల పోరాటాలు, మహిళ,దళిత, ఆదివాసీ ఉద్యమాల వంటి ఆందోళనలన్నీ అందులో భాగమే. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వాలు ఆందోళనలను నిరంకు శంగా అణచటానికి ప్రయత్నం చేస్తున్నాయి.ఈ ఉద్యమాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కార్పొరేట్ ప్రయోజనాలను దెబ్బతీసేవే. తమ మార్కెట్లను, లాభాపేక్షను కాపాడుకోవటానికి శ్రామిక వర్గాలపై కార్పొరేట్ శక్తులు దాడి సాగిస్తున్నాయి. ఉద్యోగుల తొలగింపు మొదలుకొని జీతభత్యాల కోత వరకు అన్నీ ఈ కోవలోనివే. కార్పొరేట్లకు చౌకగా లేబర్ దొరకాలంటే ప్రభుత్వరంగం బలహీనంగా ఉండాలి. అందులో పనిచేసే వారికి జీతాలు తక్కువగా ఉండాలి. ఇప్పుడు మోడీ చేపట్టిన ఉద్యమం అందులో భాగంగానే చూడాలి. నష్టపోతున్న శ్రామికుల పక్షాన కమ్యూనిస్టులు, కార్మిక తదితర ప్రజాతంత్ర సంఘాలు నిలబడు తున్నాయి. ప్రజల మధ్య ఐక్యత కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారిని చీల్చి ప్రజా ఉద్యమాలను బలహీన పర్చటానికి పాలక వర్గాలు కుట్ర పన్నుతున్నాయి. అందుకు కులం, మతం, ప్రాంతం లాంటి ఏ ఒక్క అంశాన్ని వారు వదలటం లేదు. బిజెపి మతోన్మాదం కార్పొరేట్ శక్తులకు పెద్ద అండగా ఉంది. మతోన్మాదం,కార్పొరేట్ శక్తుల అపవిత్ర కూటమి ఈ రోజు దేశాన్ని శాసించాలని చూస్తున్నది. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగబోతున్నాయి. వరుసగా పదేళ్లు ప్రధానిగా పదవి నిర్వహించిన మోడీ మరోమారు కూడా తానే అంటూ రంగంలో ఉన్నారు. ఈ క్రమంలో నష్టపోతున్న దే ప్రజలంతా ఎక్కడిక్కడ ఆలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# అంతకంతకూ పెరుగుతున్న భూకంప మృతుల సంఖ్య

మంచినీటి కోసం బాధితుల నరకయాతన

కొనసాగుతున్న భారత్ సహాయక చర్యలు

మరో సహాయక బృందం వెళ్లినట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ ట్వీట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** టర్కీ, సిరియాలో మృత్యు విలయం కొనసాగుతోంది.. ఎటు చూసినా శిథిలాలు.. శవాల గుట్టలే కనిపిస్తున్నాయి.. ఇప్పటికే 15వేల మందికి పైగా మృతి చెందారు. మృతుల సంఖ్య 25వేలకు పైగానే ఉంటుందా..? అంటే అంతకు మించి అన్నట్టుగా ఉంది అక్కడి పరిస్థితి.. భూ ప్రళయం అనంతరం విపత్కర పరిస్థితులతో టర్కీ, సిరియా దేశాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఎక్కడ చూసినా హృదయ విదారక పరిస్థితులు.. శిథిలాల నుంచి చిన్నారులను కాపాడుతున్న దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కంట తడి పెట్టిస్తున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు లేక అలమటించిపోతున్నారు ఆ పసిబిడ్డలు. ఆ దృశ్యాలు కలిచివేస్తున్నాయి. ఇక ఎక్కడ చూసినా ఆకలి కేకలే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ దళాలు సహాయక చర్యలను ముమ్మరం చేసింది. రెండ్రోజులుగా తినేందుకు తిండి, తాగేందుకు నీరు లేక విలవిలలాడిపోతున్నారు స్థానికులు. భూకంపం ధాటికి ఇళ్లు కూలిపోయి నిలువ నీడ లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు రెస్క్యూ సిబ్బంది. ఎముకలు కొరికే చలిలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. టర్కీ ప్రెసిడెంట్ రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. భూకంపం అనంతరం ప్రభుత్వం ప్రతిస్పందనపై విమర్శల వ్యక్తమవుతున్న వేళ.. ఎర్డోగాన్ ప్రభుత్వ లోపాలను అంగీకరిస్తున్నట్లు తెలిపారు. టర్కీతో పాటు సిరియాకు కూడా సాయం అందించేందుకు భారత్ 'ఆపరేషన్ దోస్త్' ప్రారంభించింది. భారత్ నుంచి రెండు వాయుసేన విమానాల్లో సహాయక బృందాలు, రెస్క్యూ ఆపరేషన్స్ కోసం ట్రైనింగ్ పొందిన డాగ్ స్క్వాడ్ టర్కీకి తరలివెళ్లాయి. ప్రస్తుతం ముమ్మరంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఇక గురువారం కూడా హిండన్ ఎయిర్‌బేస్ నుంచి అ-17 గ్లోబ్ మాస్టర్ ఎయిర్ క్రాఫ్ట్ సహాయసామగ్రి, బృందాలతో భూకంప బాధిత ప్రాంతాలకు బయలుదేరింది. రేషన్, మెడిసిన్‌తో పాటు 51మంది టీమ్.. భూకంప బాధిత ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టనుంది. ఈ మేరకు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ట్విట్ చేశారు. భూకంపం బాధితులకు సాయం అందించడానికి భారత్ నుంచి వెళ్లినట్లు పేర్కొన్నారు. మరిన్ని సెర్చ్ అండ్ రెస్క్యూ టీమ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, అవసరమైన పరికరాలు, మందులు, సహాయక సమాగ్రిని పంపించినట్లు పేర్కొన్నారు.

# రైతాంగ సమస్యలపై చర్చకు వెనకడుగు

అంతా మంచిగా ఉంటే ఎందుకీ బెరుకు

విద్యుత్ కోతలపై ఎందుకీ బుకాయింపు

సిఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శ

24 గంటల కరెంట్‌పై అబద్దాలు: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడంపై సీఎల్పీ భట్టి విక్రమార్క అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని అన్నారు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామంటున్న ప్రభుత్వం కనీసం నాలుగు గంటలు కూడా ఇవ్వడంలేదని వాపోయారు. నాలుగు గంటలైనా కోతలు లేకుండా చూడాలని కోరారు. ఇదే విషయంపై చర్చ కోసం గొంతు పోయేలా అరిచినా స్పీకర్ పట్టించు కోవడం లేదని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్నా స్పీకర్ కనీసం తమవైపు చూడటం లేదని అందుకే నిరసన తెలిపుతూ సభ నుంచి బయటకు వచ్చామని చెప్పారు. గంటల తరబడి ప్రసంగాలు, బడాయి మాటలుతప్ప బడ్జెట్‌లో ఏమిలేదని భట్టివిక్రమార్క విమర్శించారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందే! అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రపంచదేశాల ఇంజినీర్లంతా చూసి మెచ్చుకుంటున్నారని చెబుతున్నారని, మరి ప్రతిపక్షాలను ఎందుకు చూడనీయటంలేదని ప్రశ్నించారు 'మేము చూస్తే అవినీతి బయటికి వస్తుందన్న భయమా అని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి, కృష్ణా, మంజీరా నదుల నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఇందులో బీఆర్ఎస్ గొప్పతనం ఏమిలేదని అన్నారు. 'రోజుకు నాలుగున్నర గంటల నుంచి 5 గంటలకు మించి త్రీఫేజ్ కరెంటు రావటంలేదన్నారు. విద్యుత్‌పై అసెంబ్లీలో మంత్రులు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ మాట్లాడుతూ... 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్టు సభలో పచ్చి అబద్దాలు చెప్తున్నారని మండిపడ్డారు. కనీసం 8, 9 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులు సబ్ స్టేషన్‌ల ముందు ధర్నాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు కంటి వెలుగు పరీక్షలు చేయించుకోవాలని...అప్పుడైనా ధర్నాలు కనపడతాయని ఎద్దేవా చేశారు. కరెంటు కోతల నిజం తెలుసుకునేందుకు గ్రామాలకు అఖిలపక్షాన్ని తీసుకెళ్ళాలని డిమాండ్ చేశారు. సభలో ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా... మంత్రులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని విమర్శించారు. కనీసం రోజుకు 13 గంటల కరెంటు ఇచ్చి.. రైతులను ఆదుకోవాలన్నారు. కరెంటు కోతలపై శాసనమండలిలో చర్చ జరగాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# పెళ్లి విందులో ప్లేట్ల గొడవ

## క్యాటరింగ్ వ్యక్తిని కొట్టి చంపిన డిజె బృందం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** పెళ్లి విందులో భోజనం తినే ప్లేట్‌ల విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో క్యాటరింగ్ వ్యక్తిని డీజే బృందం కొట్టి చంపింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. రోహిణి ప్రాంతంలోని జపనీస్ పార్క్‌లో బుధవారం రాత్రి ఒక పెళ్లి వేడుక జరిగింది. హాజరైన అతిథులంతా భోజనం చేసిన తర్వాత డీజే టీమ్ సభ్యులు, క్యాటరింగ్ సిబ్బంది విందు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే భోజనం ప్లేట్లను తిరిగి వినియోగించాల్సి ఉండటంతో డీజే బృందం త్వరగా తినాలని క్యాటరింగ్ సిబ్బంది కోరారు. ఆ తర్వాత భోజనం చేసేందుకు వారు వేచి ఉన్నారు.కాగా, మెల్లగా తింటున్న డీజే బృందంపై క్యాటరింగ్ సిబ్బంది మండిపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణకు ఇది దారి తీసింది. ఈ నేపథ్యంలో డీజే బృందంలోని ఒక వ్యక్తి ఎలాస్టిక్ డబ్బాతో క్యాటరింగ్ చేసే 23 ఏళ్ల సందీప్ ఠాకూర్ తలపై కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. క్యాటరర్ హత్యకు సంబంధించి డీజే బృందానికి చెందిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసేందుకు వారి కోసం వెతుకుతున్నారు. మృతుడు సందీప్ ఠాకూర్‌కు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారని సోదరుడు తెలిపాడు. తమకు న్యాయం చేయాలని అతడు డిమాండ్ చేశాడు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌కు తప్పిన ప్రమాదం

ఊడివచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం టైరు



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ వాహనం టైర్ ఊడిపోయింది. రాజాసింగ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరై ఇంటికి వెళు ండగా ధూల్‌పేట ఎక్సైజ్ ఆఫీస్ ముందు వాహనం టైర్ ఊడిపోయింది. స్పీడ్ తక్కువగా ఉండటంతో ఎవరికీ ఏమీ కాలేదు. ఇప్పటికే ఎన్నోసార్లు రాజాసింగ్ వెహికిల్ నడిరోడ్డుపై ఆగిపోయింది. బులెట్ ప్రూఫ్ వెహికిల్ మార్చాలని గత కొంతకాలంగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా తన భద్రతను ప్రభుత్వం గాలికొదిలేసిందని రాజాసింగ్ వాపోయారు. తన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా అనేకసార్లు బుల్లెట్ ప్రూఫ్ వాహనం రోడ్డుపై ఆగిపోవడంతో రాజా సింగ్ వేరే వాహనాల్లో వెళ్లేవారు.

# సకాలంలో కళ్యాణలక్ష్మి సాయం అందచేత

## శాసనసభలో వెల్లడించిన మంత్రి గంగుల


**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** దేశంలో ఎక్కడాలేని విధంగా నిరుపేద ఆడబిడ్డల పెండ్లిండ్లకు తెలంగాణ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రూ. లక్షా1116 ఆర్థిక సహాయం అందజేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. శాసనసభ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. లగ్నపత్రిక పెట్టుకున్న రోజే కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకుంటే పెళ్లి రోజే కల్యాణ మండపంలో ఆర్థిక సహాయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అనేక మంది పెళ్లి అయిన తరువాత దరఖాస్తులు చేసుకోవడం వల్ల వాటిని 15 రోజుల్లో పరిశీలించిన పిదప అర్హులకు అందజేస్తున్నామని వెల్లడించారు. ఎక్కడా కూడా ఆర్థిక సహాయం అందజేతలో జాప్యం జరగడం లేదని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 50 వేల రూపాయల ఆదాయం. పట్టణాల్లో రూ. రెండు లక్షల ఆదాయం ఉన్న వారికి మాత్రమే కల్యాణలక్ష్మిని ఇస్తున్నామని వెల్లడించారు. కల్యాణలక్ష్మి పథకాన్ని అందరూ అభినందిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకం పేదలకు వరంగా మారిందన్నారు. సిఎం కెసిఆర్ చిత్తుశుద్ధితో అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు.



# లోకేశ్ యాత్రకు అడుగడుగునా అడ్డంకులు

మైక్ లాగేసుకున్న పోలీసులు..భగ్గుమన్న టిడిపి

గంగాధర నెల్లూరులో 14వ రోజు యాత్ర ప్రారంభం




**చిత్తూరు, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** టీడీపీ నేత లోకేష్ పాదయాత్రకు పోలీసులు అడుగడునా అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల లోకేష్ ప్రచార వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు తాజాగా లోకేష్ మాట్లాడే మైక్‌ను లాక్కున్నారు. గురువారం సంసిరెడ్డిపల్లెకు చేరుకున్న లోకేష్ పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. లోకేష్‌ను మాట్లాడనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. మైక్ తీసుకొస్తున్న బాషాపై దాడి చేసి గాయపరిచి మరీ పోలీసులు మైక్ లాక్కున్నారు. లోకేష్ నిలుచున్న స్టూల్‌ను కూడా లాక్కునేందుకు ప్రయత్నించారు. పోలీసుల తీరుపట్ల టీడీపీ శ్రేణులు భగ్గుమన్నారు. పోలీసులకు టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా లోకేష్ స్టూల్ మీదే నిలబడి నిరసన తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సొంత నియోజకవర్గం గంగాధరనెల్లూరులో 14వ రోజు లోకేష్ యువగళం పాదయాత్ర మొదలైంది. దాదాపు ఐదారు కిలోమీటర్లు నడిచిన తర్వాత గంగాధర నెల్లూరు మండలం సంసిరెడ్డిపల్లె వద్దకు పాదయాత్ర చేరుకుంది. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడేందుకు హ్యాండ్ మైక్‌ను తీసుకురావాల్సిందిగా కార్యకర్తను లోకేష్ కోరారు. మైక్ తీసుకువెళ్తున్న కార్యకర్తను పోలీసులు బలవంతంగా అడ్డుకున్నారు. ఇక్కడ మాట్లాడేందుకు వీలులేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యకర్త భాషాపై పోలీసులు దాడి చేయడంతో రక్తస్రావమైంది. దీంతో టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నిరసన చేపట్టారు. టీడీపీ శ్రేణులు ఆందోళన చేస్తున్న ప్రాంతంలోనే వారికి మద్దతుగా లోకేష్ స్టూల్ మీద ఎక్కి నిరసనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఏదో ఒక ఆవాంతరం నడుమ లోకేష్ పాదయాత్ర కొనసాగుతోంది.

# ఫార్మాసిటీపై తప్పుడు ఆరోపణలు తగవు

ఆరోపణలు చేసి కరెక్ట్ అంటే కుదరదు

శ్రీధర్‌బాబుకు గట్టిగా కౌంటర్ ఇచ్చిన కెటిఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** ఫార్మా సిటీ భూములపై కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చురకలంటించారు. ఫార్మా సిటీలో భూముల కొనుగోలు, విక్రయాలపై తప్పుడు ఆరోపణలు చేసిన శ్రీధర్ బాబుపై కేటీఆర్ మండిపడ్డారు. ఐ స్టాండ్ కరెక్టెడ్ ఇఫ్ ఐయామ్ నాట్ రైట్ అని శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. ఫార్మా సిటీలో భూములను రూ. 8 లక్షలకు కొని.. రూ. కోటి 30 లక్షలకు అమ్ముతున్నారని శ్రీధర్ బాబు అడ్డగోలుగా ఆరోపణలు చేసి ఐ స్టాండ్ కరెక్టెడ్ అని అందంగా ఇంగ్లీష్‌లో చెప్తే ఎలా? అని కేటీఆర్ అడిగారు. చేసింది తప్పుడు ఆరోపణ.. ఉపసంహరించుకునేందుకు భేషజాలు ఎందుకు..? అని ప్రశ్నించారు. శ్రీధర్ బాబు మంచి విద్యాధికుడు. రాజకీయాల్లో విమర్శ కోసమే విమర్శ.. అసత్యాన్ని కూడా అందంగా, వినసొంపుగా చెప్తే అది సత్యమై పోతదన్నట్టు వారు మాట్లాడేస్తున్నారు. అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ఫార్మా సిటీలో భూములను ఎకరాకు రూ. 8 లక్షల చొప్పున కొనుగోలు చేశారని, రూ. ఒక కోటి 30 లక్షలకు విక్రయించినట్లు శ్రీధర్ బాబు మాట్లాడారు. ఒక్క ఎకరం కాదు ఒక్క సెంటు కేటాయించినట్లు నిరూపించగలరా..? అని శ్రీధర్ బాబుకు కేటీఆర్ సవాల్ విసిరారు. నిరూపించకపోతే క్షమాపణ చెబుతారా? అని అడిగారు. రాజకీయ వేదికల మీద మాట్లాడిన విధంగానే అడ్డగోలుగా మాట్లాడుతున్నారు.ఆర్టీఐ పేరిట అడ్డగోలుగా బ్లాక్ మెయిల్ దందాలు చేస్తాం. ఆర్టీఐని రూట్ టు ఇన్‌కమ్‌గా మార్చుకుంటాం అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా భూములపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి వద్ద ఒక దఫ్తర్ నడుస్తుంది. ఓ ప్రత్యేక కార్యాలయంలో రిటైర్డ్ తహసిల్దార్లతో సహా కొంతమందిని కూర్చోబెట్టుకుని ప్రభుత్వాన్ని, ప్రయివేటు వ్యక్తులను బ్లాక్ మెయిల్ చేసి కోట్లాది రూపాయాలు వసూళ్లు చేసే వారికి ధరణి వల్ల ఇబ్బంది ఉంటుంది. అది శ్రీధర్ బాబుకు ఉండకూడదు. ఫార్మా సిటీలో ఇప్పటి వరకు ఎకరం కాదు.. అర ఎకరం కాదు.. గజం కూడా కేటాయించలేదు. తెలువకపోతే తెలుసుకోవాలని శ్రీధర్ బాబుకు కేటీఆర్ సూచించారు. సభను తప్పుదోవ పట్టించే విధంగా సత్య దూరమైన మాటలు మాట్లాడుతూ, ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు. ఫార్మాసిటీలో ఒక గజం భూమి అమ్మినట్లు రుజువు చేయగలుగుతారా? అని సవాల్ విసిరారు. రాజకీయంగా లబ్ది పొందాలని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పార్లమెంట్‌ను వీడని ఆదానీ ప్రకంపనలు




(మొదటి పేజీ తరువాయి) మోసాలను కప్పిపుచ్చలేరని అన్నారు. ఇక రాజ్యసభలో ప్రధాని మోదీపై ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. ప్రధాని మోదీ ఎప్పుడూ ఇష్యూలను డైవర్ట్ చేస్తున్నారని, అదానీ గురించి ఎన్నో ప్రశ్నలు వేశామని, కానీ ఒక్కదానికి కూడా సమాధానం రాలేదని ఖర్గే అన్న వ్యాఖ్యల్ని తొలగించారు. దేశ ప్రజల హక్కు కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతూ ఉంటుందని ఖర్గే అన్నారు. అన్ని రూల్స్‌ను పరిగణలోకి తీసుకుని తన వ్యాఖ్యల్ని తొలగించాలని, ఈ అంశంలో మూడు పేజీల రిప్లై ఇచ్చినట్లు ఖర్గే తెలిపారు.

## 12మందికి ప్రలోభాలపై చర్య తీసుకోండి



(మొదటి పేజీ తరువాయి) ఎమ్మెల్యేలపై కూడా విచారణ జరపాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి రాష్ట్ర డీజీపికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ..12 మంది ఎమ్మెల్యేలను అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి అక్రమంగా చట్ట వ్యతిరేకంగా టీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్న అంశంలో గతంలోనే ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. జనవరి 6వ తేదీన మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశామని రేవంత్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు ఆర్థిక, రాజకీయ ప్రలోభాలు ఆశ చూపి టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని ఈ విషయంలో తాము ఇప్పటికే హైకోర్టులో ఫిర్యాదు చేశామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కేసు నెంబర్ 455లో తమ ఫిర్యాదును కూడా జత చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ప్రలోభాల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, 12 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

## జింఖానాలో బిఆర్ఎస్ భారీ సభ



(మొదటి పేజీ తరువాయి) అంబేద్కర్ తెలంగాణ సచివాలయ భవనాన్ని ఈ నెల 17వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల మధ్య ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, జార్ఖండ్ ముఖ్యమంత్రులు స్టాలిన్, హేమంత్‌సోరెన్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తరఫున ఆయన ప్రతినిధిగా జేడీయూ జాతీయ అధ్యక్షుడు లలన్‌సింగ్, అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ తదితర ప్రముఖులు పాల్గొంటారు. భవన ప్రారంభోత్సవానికి ముందు ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో వాస్తుపూజ, చండీయాగం, సుదర్శనయాగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సచివాలయ ప్రారంభం తరువాత మధ్యాహ్నం సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. ఈ సభలో సచివాలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యే ముఖ్య అతిథులంతా పాల్గొననున్నారు. సచివాలయ భవనానికి జూన్ 2019న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. అత్యాధునిక పద్ధతులు, సకల సౌకర్యాలతో మూడున్నరేండ్లలోనే అందుబాటులోకి రావడం విశేషం

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో వ్యక్తి అరెస్ట్



(మొదటి పేజీ తరువాయి) గుర్తించారు. గోవా ఎన్నికల్లో ఆప్ పార్టీ ఈ డబ్బును ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజేష్ జోషిని సీబీఐ అధికారులు రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరు పర్చనున్నారు. ఢిల్లీకి చెందిన రాజేష్ జోషి నగదు బదిలీ చేయడంలో కీలకంగా వ్యవహరించారని ఈడీ అధికారులు గుర్తించారు. హైదరాబాద్ నుంచి నగదును ఢిల్లీకి తరలించారని గుర్తించారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇప్పటి వరకు సీబీఐ, ఈడీ అధికారులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యాపారవేత్తలు ఒబెరాయ్ హోటల్ లో ఎంత మొత్తానికి మంతనాలు చేశారు..? ఆ డబ్బును పంజాబ్, గోవాలో ఖర్చు పెట్టినట్లు వస్తున్న వార్తల్లో నిజమేంత..? ఈ కేసులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కు చెందిన కొంతమంది రాజకీయ నాయకులకు సంబంధాలు ఏంటి..? అనే కీలక అంశాలపై ఈడీ, సీబీఐ అధికారులు విచారణను మరింత వేగవంతం చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు అరెస్ట్ అయ్యారు. వారిలో శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లి, ఎమ్మెల్సీ కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబు ఉన్నారు. తాజాగా చారియట్ మీడియా అధినేత రాజేష్ జోషిని కూడా ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ముడుపులుగా అందిన డబ్బులను గోవా ఎన్నికలకు ఆప్ పార్టీ ఉపయోగించిందని ఇప్పటికే ఈడీ అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. చారియట్ మీడియా సంస్థ ద్వారా పెద్ద ఎత్తున డబ్బును గోవా ఎన్నికల్లో ఆప్ తరఫున రాజేష్ జోషి ఖర్చు పెట్టారని ఈడీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## కంటివెలుగు శిబిరంలో సిఎస్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి) లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు తాత మధు, కౌశిక్ రెడ్డి కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు

## రాజ్యసభలో అరుదైన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి) పీటీ ఉష తన ట్విట్టర్లో పోస్ట్ చేశారు.ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ చెప్పినట్లుగా గొప్ప స్థానం గొప్ప బాధ్యతను కలిగి ఉంటుంది. నేను రాజ్యసభ సెషన్‌కు అధ్యక్షత వహించినప్పుడు నాకు కూడా అలాగే అనిపించింది. ప్రజలు నాపై ఉంచిన నమ్మకంతో ఈ జర్నీలో మరో మైలురాయి సాధిస్తా' అని ఉష తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజ్యసభ ఛైర్మన్ లేదా డిప్యూటీ ఛైర్మన్ అందుబాటులో లేనప్పుడు సభ కార్యకలాపాలను నిర్వహించే రాజ్యసభ వైస్ ఛైర్‌పర్సన్‌ల ప్యానెల్‌లోని నామినేటెడ్ సభ్యుల్లో ఒకరు అధ్యక్షత బాధ్యతలు చూస్తారు. గతేడాది రాజ్యసభకు నామినేట్ అయిన పీటీ ఉష ఈ కమిటీలో మెంబర్ గా ఉన్నారు.

## రాజ్యసభలో తీవ్ర గందరగోళం



(మొదటి పేజీ తరువాయి) న్యూఢిల్లీ,ఫిబ్రవరి9(ఆర్ఎన్ఎ): రాజ్యసభలో గతంలో ఎన్నడూ లేనంతగా గందరగోళం చెలరేగింది. ప్రధాని మోడీ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు విపక్షాలు మూకుమ్మడిగా నినాదాలు చేశాయి. పోడియంలోకి దూసుకుని వచ్చి ఆదానీ వ్యవహారంపై జెపిసికి డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో విపక్షాలను లెక్కచేయని ప్రధాని మోడీ తన ధోరణిలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడారు. విపక్షాల నినాదాల మధ్య మోడీ ఏం మాట్లాడుతున్నారో కూడా వినిపించలేదు. అయినా మోడీ వెనక్కి తగ్గకుండా ..నినాదాలను లెక్కచేయకుండా ప్రసంగాన్ని కొనసాగించారు. కాంగ్రెస్‌ను విమర్శిస్తూనే.. విపక్షాలనుద్దేశించి, మీరు బిజెపిపై ఎంతగా బురద జల్లితే..కమలం అంతగా వికసిస్తుందని అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'నేను ఈ ప్రతిపక్ష ఎంపీలకు ఒక్కటే చెప్పాలనుకుంటున్నాను.. మీరెంత బురద జల్లితే..కమలం అంతలా వికసిస్తుంది' అన్నారు. గత నాలుగేళ్లలో 11 కోట్ల ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు ఇచ్చాం, తొమ్మిదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా 48 కోట్ల జనధన్ ఖాతాలు తెరిచాము' అన్నారు. ఓ వైపు ప్రధాని మోడీ మాట్లాడుతుంటే ప్రతిపక్షాలు అదానీ, మోడీకి వ్యతిరేకంగా నినాదాలు కొనసాగించారు. ఈ క్రమంలో ఓ వైపు నినాదాలు..మరోవైపు మోడీ ప్రసంగంతో ఏం జరుగుతుందో తెలియని గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ అదానీ కేసులో సంయుక్త పార్లమెంటరీ కమిటీ దర్యాప్తును చేపట్టాలన్నారు. 'ప్రభుత్వానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయడానికి భయం లేకుంటే దానిని వేయాలి, పార్లమెంటరీ కమిటీ ద్వారా దర్యాప్తు జరిపించాలి' అన్నారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 'అభివృద్ధి చెందిన భారత దేశం' దార్శనికతను పార్లమెంటుకు సమర్పించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ సంఘం చేత దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. మోదీ మాట్లాడుతూ, వారు ఎంత ఎక్కువ బురద జల్లితే, కమలం అంత గొప్పగా వికసిస్తుందని చెప్పారు. కొందరి భాష, ప్రవర్తన భారత దేశానికి నిరాశ కలిగిస్తున్నాయన్నారు. తనపైనా, తన ప్రభుత్వంపైనా ప్రతిపక్షాల ఆరోపణలను ప్రస్తావిస్తూ, వారి వద్ద బురద ఉందని, తన వద్ద గులాల్ ఉందని, ఎవరి దగ్గర ఏది ఉంటే, దానినే వారు విసురుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలించిన సమయంలో అభివృద్ధికి ఆటంకాలు సృష్టించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పరిపాలించిన ఆరు దశాబ్దాల కాలంలో మన దేశం నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, అదే సమయంలో చిన్నచిన్న దేశాలు అభివృద్ధి చెందాయన్నారు. ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో ఆ సమస్యలకు పరిష్కారాలను అందజేయవలసిన బాధ్యత కాంగ్రెస్ పార్టీకి ఉందని, కానీ ఆ పార్టీ నేతల ప్రాధాన్యతలు, ఉద్దేశాలు వేరు అని తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారాల కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ, ఖర్గే గారు చెప్పినట్లుగా పునాదుల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రయత్నించి ఉండవచ్చునని, అయితే కాంగ్రెస్ పాలనా కాలంలో కేవలం గోతులను మాత్రమే తవ్వారని దుయ్యబట్టారు. గడచిన మూడు, నాలుగేళ్ళలో దాదాపు 11 కోట్ల ఇళ్లకు కొళాయి నీటి కనెక్షన్లు అందినట్లు తెలిపారు. సామాన్యులను సాధికారులను చేయడం కోసం జన్ ధన్ ఖాతా ఉద్యమాన్ని ప్రారంభించా మన్నారు. గడచిన తొమ్మిదేళ్లలో సుమారు 48 కోట్ల జన్ ధన్ ఖాతాలను తెరిచినట్లు తెలిపారు.

## పాముకాటుకు గురై బాలిక మృతి



(మొదటి పేజీ తరువాయి) అంటూ ట్విట్టర్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'వందల కోట్ల రూపాయలు ఏ పందికొక్కులు బుక్కినయ్..? ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను నిర్వీర్యం చేయడమేనా..? మీ లక్ష్యం' అంటూ ట్విట్టర్ వేదికగా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టు మోహన్, పార్వతిలకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు భట్టు మన్విత (6) వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ శివారులోని భట్టుతండాలోని ప్రైమరీ స్కూల్?లో చదువుతోంది. నిన్న ఉదయం స్కూల్?కు వెళ్లింది. గురువారం చెవులు కుట్టే ప్రోగ్రాం ఉందని ఫ్రెండ్స్‌కు చెప్పుకొని మురిసిపోయింది. బాత్?రూం వస్తుందని టీచర్‌కు చెప్పడంతో వెళ్లమన్నాడు. క్లాస్ రూం నుంచి బయటికొచ్చిన మన్విత.. మెట్లు దిగుతుండగా తాచుపాము కాటేసింది. ఈ విషయాన్ని టీచర్‌కు చెప్పడంతో అతను పేరెంట్స్‌కు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి మన్వితను నర్సంపేట హాస్పిటల్?కు తరలిస్తుండగా, మార్గమధ్యలో చనిపోయింది. చెవులు కుట్టే ప్రోగ్రాం ఉండటంతో ఇంటికొచ్చిన బంధువులు మన్విత చనిపోయిందని తెలుసుకుని కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు




(మొదటి పేజీ తరువాయి) 2, ఏపీలో 13 ఎమ్మెల్సీ స్థానాలకు ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ టీచర్ ఎమ్మెల్సీతో పాటు హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయనున్నారు. తెలంగాణలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. హైదరాబాద్-రంగారెడ్డి - మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్స స్థానానికి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఈ ఎన్నికకు సంబంధించి ఈ నెల 16వ తేదీ నోటఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 23వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం కల్పించారు. మార్చి 13న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. 16న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఇప్పటికే ఆయా ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనుండగా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ పదవీకాలం మే 1తో పూర్తి కానుంది. అటు ఏపీలోనూ 13 ఎమ్మెల్సీ స్థానాల భర్తీ షెడ్యూల్ ను ఈసీ ప్రకటించింది. అందులో 8 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలు ఉండగా.. మూడు గ్రాడ్యుయేట్, 2 టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలున్నాయి. ఈ స్థానాలన్నింటికీ కూడా మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్ జరగనుంది.

## ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యం

### వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచన

**జగిత్యాల, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు పెంచాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష డాక్టర్లకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ యాస్మిన్ భాష.. ప్రధాన ఆసుపత్రి, వార్డులలో పేషెంట్లకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి లో తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్.. బాలింతలతో మాట్లాడి వైద్య సేవలను గురించి తెలుసుకున్నారు. పేషంట్స్ కు పెట్టే ఫుడ్ క్వాలిటీని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రికి వచ్చే రోగి వెంట ఒకరు లేదా ఇద్దరు మాత్రమే అటెండెంట్ ఉండాలని ఎక్కువమంది ఉంటే బాలింతలు ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఉంటుందని అధికారులకు చెప్పారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించిన కలెక్టర్ యాస్మిన... లీవ్ లో ఉన్న డాక్టర్ల వివరాలతో పాటు, అందుకు గల కారణాలను కూడా తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహిళలను వేధించే ఆకతాయిలకు వార్నింగ్

### నడవడి మార్చుకోకుంటే కఠిన చర్యలు ● రాచకొండ సీపీ చౌహాన్ హెచ్చరిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** యువతులు, మహిళల్ని వేధించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని రాచకొండ సీపీ చౌహాన్ హెచ్చరించారు. మహిళా భద్రతకే తమ మొదటి ప్రాధాన్యత అని చెప్పారు. ఆడపిల్లల్ని వేధించే వారి మీద చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవ్ టీజర్ల కౌన్సిలింగ్ ప్రోగ్రాంలో సీపీ చౌహాన్ పాల్గొన్నారు. ఆకతాయి చేష్టలు, గృహహింస, పని ప్రదేశాల్లో వేధింపుల తదితర అనేక ఇబ్బందుల నుంచి మహిళల్ని రక్షించేందుకు షీ టీమ్స్ చర్యలు చేపడుతోందని తెలిపారు. మహిళలకు ఎదురయ్యే భౌతిక, లైంగిక వేధింపులు నుంచి రక్షణ కోసం రాచకొండ పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారని సీపీ ప్రకటించారు. పురుషులు ఆడవారి పట్ల బాధ్యతగా, మర్యాదగా నడుచుకోవాలని, వారికి అండగా నిలవాలని హితవు పలికారు. గడిచిన 2 నెలల్లో ఈవ్ టీజర్ల మీద 118 కేసులు నమోదు అయ్యాయన్నారు. వాటిలో 44 కౌన్సెలింగ్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మొత్తం 247 మంది ఆకతాయిలను అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ స్పష్టం చేశారు.

## ప్రగతిభవన్ పేల్చేస్తారా.. ! అసెంబ్లీలో కెటిఆర్ ఫైర్..!



(మొదటి పేజీ తరువాయి) నెలకొందని చెప్పడం సరికాద న్నారు. ధరణిని రద్దు చేస్తామని పార్టీ అధ్యక్షుడు చెప్తున్నాడు. ధరణిని రద్దు చేయడం పార్టీ విధానమే అయితే.. పార్టీ పరంగా చెప్పండి. ధరణి వల్ల రైతులకు ఏ లాభం లేదు.. రద్దు చేస్తామని చెప్పండి. కాంగ్రెస్ హయాంలో లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయకుండా రైతులను రాక్షసంగా ఇబ్బంది పెట్టినట్లే ఇప్పుడు కూడా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాం అని శ్రీధర్ బాబు చెప్పదలుచుకున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులను పీడించడం, వారి పట్ల కర్కశకంగా వ్యవహరించడమే మా విధానం అని ఆయన చెప్పదలుచుకున్నారా..? రెవెన్యూ వ్యవస్థలో లంచగొండితనం ఉండాలనేది వారి విధానం అయితే చెప్పమనండి. ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం సరికాదు. శాసనసభను, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడొద్దని కేటీఆర్ సూచించారు. వాళ్ల అధ్యక్షుడేమో ధరణి రద్దు చేస్తా అని ప్రకటనలు చేస్తాడు. మా అధ్యక్షుడు అలా మాట్లాడలేదని శ్రీధర్ బాబు చెబుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అరాచకం సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో వారికి డిపాజిట్లు కూడా రావడం లేదు. ప్రగతి భవన్‌ను పేల్చేయాలని వారి అధ్యక్షుడు దుర్మార్గంగా మాట్లాడుతున్నాడు. ఆ వ్యాఖ్యలను సమర్థిస్తూ ఇక్కడ వారి సభ్యురాలు మాట్లాడుతారు. అసలు కాంగ్రెస్ పార్టీకి ఒక వైఖరి అంటూ ఉందా? లేదా స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అధ్యక్షుడికి, నాయకులకు సమన్వయం లేకపోతే మాకు సంబంధం లేదు. ఇంత అరాచకంగా, అడ్డగోలుగా మాట్లాడొచ్చా..? అధ్యక్షుడి మాటలను సమర్థిస్తూ వారి సభ్యురాలు మాట్లాడొచ్చా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల నోట్లో నుంచి ఒక్క పాజిటివ్ మాట కూడా రావడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఎక్కడా కాకుండా పోతుంది. ఇకనైన వారి వైఖరి మార్చుకోవాలి అని కేటీఆర్ సూచించారు. అంతకుముందు ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ధరణితో రైతులకు ఎలాంటి నష్టం జరగడం లేదన్నారు. కావాలనే బురదజల్లడం సరికాదన్నారు.

# నాగ్‌పూర్ టెస్టులో 177 పరుగులకే ఆస్ట్రేలియా ఔట్



- ఐదు వికెట్లతో ఆసిస్ వెన్ను విరిచిన జడేజా
- మూడు వికెట్లతో రాణించిన అశ్విన్
- ఇన్నింగ్ శుభారంభం చేసిన భారత్ ఓపెనర్లు
- అర్థశతకం బాదిన కెప్టెన్ రోహిత్ శర్మ
- 77 పరుగులకు వికెట్ కోల్పోయిన టీమిండియా

**నాగపూర్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫిలో భాగంగా నాగ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఫస్ట్ టెస్టు మొదటిరోజు ఆట ముగిసింది. తొలి టెస్టులో భారత్ పట్టు బిగిస్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా జట్టును టీమిండియా బౌలర్లు 177 పరుగులకే ఆలౌట్ చేశారు. చాలా గ్యాప్ తరవాత టీమ్‌లోకి వచ్చిన జడేజా 5 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటర్లను కంగారెత్తించగా .. అశ్విన్ మూడు, సిరాజ్, షమి తలో వికెట్ పడగొట్టారు. ఆ తరువాత బ్యాటింగ్ స్టార్ట్ చేసిన టీమిండియా 24 ఓవర్లు ఆడి ఒక వికెట్ నష్టానికి 77 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (20) పరుగులు చేసి టాడ్ మార్ఫీ బౌలింగ్ లో వెనుదిరిగాడు. ప్రస్తుతం క్రీజ్ లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ (56), అశ్విన్(0) పరుగులతో క్రీజ్ లో ఉన్నారు. మొత్తానికి మొదటిరోజు ఆటలో టీమిండియాదే పైచేయిగా నిలిచింది. తొలి రోజు ఆస్ట్రేలియా ను 177 పరుగులకే కట్టడి చేసిన తర్వాత ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఆట ముగిసే సరికి 77 రన్స్ చేసింది.ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పిన్‌కు ఆసీస్ దాసోహం అయింది. ఈ నంబర్ వన్ ఆల్‌రౌండర్ ఐదు వికెట్లు తీసి ఆ జట్టును దెబ్బతీశాడు. కీలకమైన లబుషేన్, స్టీవ్ స్మిత్ వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దాంతో బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ మొదటి టెస్టులోఆతిథ్య ఆస్ట్రేలియా 177 రన్స్‌కే కుప్పకూలింది. టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆ జట్టుకు ఆదిలోనే దెబ్బ తగిలింది. ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా, డేవిడ్ వార్నర్ వెంట వెంటనే ఔటయ్యారు. ఆ తర్వాత లబుషేన్ (49), స్టీవ్ స్మిత్ (37) మూడో వికెట్‌కు 84 రన్స్ జోడించారు. అయితే, రెండో సెషన్‌లో జడేజా విజృంభించాడు. ఒకే ఓవర్‌లో లబుషేన్, రెన్ షా వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బ తీశాడు. కీపర్ అలెక్స్ క్యారీ (36), హ్యాండ్స్‌కాంబ్ (31) ఫిఫ్టీ పార్ట్‌నర్‌షిప్‌తో జట్టును ఆదుకున్నారు. చివర్లో అశ్విన్ కూడా మూడు వికెట్లతో చెలరేగడంతో ఆ జట్టు 177 రన్స్‌కు పరిమితం అయింది. సిరాజ్, షమీ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఇక భారత్ ఓపెనర్లు రోహిత్ (56), రాహుల్ (21) శుభారంభం ఇచ్చారు. అయితే.. మొదటి రోజు ఆట మరో ఎనిమిది బంతుల్లో ముగుస్తుంది అనగా ఓపెనర్ రాహుల్ ఔటయ్యాడు. మర్ఫీ ఓవర్‌లో అతనికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. టెస్టుల్లో అతనికిదే మొదటి వికెట్. దాంతో 76 రన్స్ వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. రవిచంద్రన్ అశ్విన్ నైట్ వాచ్‌మెన్‌గా క్రీజులోకి వచ్చాడు. మొదటి రోజు ఆట ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 77 రన్స్ చేసింది. ఇంకా 100 రన్స్ వెనకంజలో ఉంది. రెండో రోజు భారీ స్కోర్ చేసి మ్యాచ్‌పై పట్టు బిగించాలని రోహిత్ సేన భావిస్తోంది. భారత కెప్టెన్ రోహిత్ తొలి ఓవర్ నుంచే దూకుడు కనబరిచాడు. కమిన్స్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే అతను మూడు ఫోర్లు బాదాడు. దాంతో, ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు ఎంత ప్రయత్నించినా వికెట్ తీయలేక పోయారు. ఆ జట్టు స్టార్ స్పిన్నర్ నాథన్ లియన్ కూడా ప్రభావం చూపలేకపోయాడు. రోహిత్ 66 బంతుల్లోనే అర్ధశకం బాదాడు. 56 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. అతనికి రాహుల్ చక్కని సహకారం అందించాడు. వీళ్లిద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. రాహుల్ 70 బంతుల్లో 21 రన్స్

## బెంచికే పరిమితమైన మిడిలార్డర్ బ్యాటర్ ట్రావిస్ హెడ్

### జట్టులోకి తీసుకోక పోవడంపై మాజీ ఆటగాళ్లు విమర్శలు



**నాగపూర్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** భారత్‌తో తొలి టెస్టుకు మిడిలార్డర్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ఫామ్‌లో ఉన్న హెడ్‌ను పక్కన బెట్టడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మాజీ పేసర్ ఛాడ్ సాయెర్స్ ట్విట్టర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశాడు. మాజీ ఓపెనర్ మాథ్యూ హేడేన్ సైతం తుది జట్టులో హెడ్ లేకపోవడం తాను నమ్మలేక పోతున్నానని అన్నాడు

## రవిచంద్రన్ అశ్విన్ అరుదైన ఘనత

### 450 వికెట్ల మైలురాయిని అందుకుని రికార్డు



**నాగపూర్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** నాగ్‌పూర్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతోన్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టెస్టుల్లో ఆరుదైన ఘనత సాధించాడు. 450 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ఆసీస్ ఆటగాడు అలెక్స్ క్యారీని ఔట్ చేసి అశ్విన్ ఆ ఘనతను సాధించాడు. 450 వికెట్లు తీయడంతో అశ్విన్ పలు రికార్డులు సృష్టించాడు. టెస్టుల్లో అత్యంత వేగంగా 450 వికెట్లు సాధించిన మొదటి భారత బౌలర్‌గా నిలిచాడు. 88 టెస్టుల్లో అశ్విన్ ఈ ఘనతను సాధించాడు. అంతకుముందు ఈ రికార్డు అనిల్ కుంబ్లే పేరిట ఉండేది. కుంబ్లే 93 టెస్టు మ్యాచ్ లో 450 వికెట్ల మార్క్ ను అందుకున్నాడు. ఇక ప్రపంచ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన రెండో బౌలర్‌గా అశ్విన్ నిలిచాడు. తొలి స్థానంలో శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్(80 మ్యాచ్‌లు) ఉన్నాడు. ఇక ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్‌లో 450 వికెట్ల మైలురాయిని చేరుకున్న 9వ బౌలర్‌గా అశ్విన్ నిలిచాడు.

## నాగపూర్ టెస్టులో అదరగొట్టిన బౌలర్లు

### ఆస్ట్రేలియాను దెబ్బతీసిన జడేజా

**నాగపూర్, ఫిబ్రవరి 9 (సమ సమాజం):** బోర్డర్ గవాస్కర్ ట్రోఫి మొదటి టెస్టు మ్యాచ్‌లో భారత బౌలర్లు అదరగొట్టారు. ఆస్ట్రేలియా జట్టును ఫస్ట్ ఇన్నింగ్స్ లో 177పరుగులకే ఆలౌట్ చేశారు. జడేజా5 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటర్లను కంగారెత్తించారు. టెస్టుల్లో జడ్డూ ఐదు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టడం ఇది 11వ సారి కావడం విశేషం. అశ్విన్ మూడు, సిరాజ్, షమి తలో వికెట్ పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలలో లబుషేన్ (49), స్టీవ్ స్మిత్ (37), పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (31), లెక్స్ క్యారీ (36) పరుగులు చేశారు. ఆసీస్ బ్యాటర్లను తక్కువ స్కోరుకే కట్టడి చేసిన భారత్...మరి బ్యాటింగ్ లోనూ రాణించింది. నాగ్‌పుర్ టెస్టులో భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా మ్యాజిక్ చేశాడు. లంచ్ తర్వాత కంగారుల నడ్డి విరిచాడు. తనదైన బంతులతో ఒకే ఓవర్‌లో రెండు వికెట్లు పడగొట్టాడు. హాఫ్ సెంచరీ దిశగా సాగుతున్న లబుషేన్ (49) స్టంపౌట్ చేశాడు. జడేజా బౌలింగ్ లో లబూషేన్ ముందుకొచ్చి ఆడబోగా... కేఎస్ భరత్ స్టంపౌట్ చేశాడు. ఆ తర్వాతి బంతికే రెన్ షాను డకౌట్ చేశాడు. అయితే ఈ సమయంలో ఆస్ట్రేలియా డీఆర్ఎస్‌కు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో 36 ఓవర్లు ముగిసేసరికి ఆస్ట్రేలియా 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. అసకసేఉడు క్రీజులో స్టీవ్ స్మిత్ (25), హ్యాండ్స్‌స్కాబ్ (4) పరుగులతో ఉన్నారు.






## ప్రభాస్, కృతి సనన్‌లపై ఆగని దుమారం

### పెళ్లి పీటలు ఎక్కబోతున్నారన్న జోరు ప్రచారం

టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారంటూ.. టాలీవుడ్, బాలీవుడ్ మీడియాలో సైతం వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై అటు ప్రభాస్, ఇటు కృతి ఇద్దరూ స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. అయినా వార్తలకు ఏమాత్రం బ్రేక్ పడట్లేదు. తాజాగా వీరి పెళ్లి వార్త మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. వీరిద్దరూ మాల్దీవుల్లో నిశ్చితార్థం చేసుకోబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయంటూ సోషల్‌మీడియా సహా పలు వెబ్‌సైట్లలో వరుస కథనాలు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ టీం స్పందించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలిపింది. అవన్నీ రూమర్సే అంటూ కొట్టిపారేసింది. 'ప్రభాస్, కృతి సనన్ ఇద్దరూ మంచి స్నేహితులు మాత్రమే. వీరిద్దరి ఎంగేజ్మెంట్ అంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అని వెల్లడించింది. ప్రభాస్, కృతిసనన్ జటంగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఆదిపురుష్'. దర్శకుడు ఓం రౌత్ ఈ చిత్రాన్ని రామాయణం నేపథ్యంలో తెరకెక్కించాడు. ఈ చిత్రంలో ప్రభాస్ రాముడి పాత్రలో నటించగా.. కృతి సనన్ హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రం జూన్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## అల్లరి నరేశ్..మరో యాతక్షన్ చిత్రం ఉగ్రం




ఒకప్పుడు కామెడీ హీరోగా పేరు తెచ్చుకున్న అల్లరి నరేష్... ఈ మధ్య ట్రెండు మార్చి సిరియస్ సినిమాల్లో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఆయన నటించిన నాంది సూపర్ హిట్ కాగా ఆ తర్వాత నటించిన ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ఇప్పటికే ఓటీటీలో కూడా సందడి చేస్తోంది. అయితే అల్లరి నరేష్ నాంది లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ను తనకు అందించిన దర్శకుడు విజయ్ తో కలిసి మరో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పేరే ఉగ్రం. గతంలో వీరి కాంబినేషన్లో తెరకెక్కిన నాంది సినిమా సూపర్ హిట్ కావడంతో వీరిద్దరి కాంబినేషన్ మీద ప్రేక్షకులలో అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఉగ్రం పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించిన రిలీజ్ డేట్ కూడా ఇప్పటికే ప్రకటించారు. ఉగ్రం సినిమా ఏప్రిల్ 14వ తేదీన రిలీజ్ చేసేందుకు సినిమా యూనిట్స్ సిద్ధమవుతుండగా ఇప్పటికే ఈ సినిమా యూనిట్ అధికారిక ప్రకటన కూడా చేశారు. ఇక తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ సినిమా టీజర్ అప్డేట్ కూడా వచ్చేసింది. ఈ సినిమా టీజర్ ని శివరాత్రి సందర్భంగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 18వ తేదీన శివరాత్రి రానుండగా అదే రోజు టీజర్ రిలీజ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఈ సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్ గా దర్శన నటిస్తుండగా శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందిస్తున్నారు. సాహు గారపాటి హరీష్ పెద్ది కలిసి ఈ సినిమాని ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు ఖచ్చితంగా మొదటి సినిమా వీరిద్దరి కాంబినేషన్లో సూపర్ హిట్ కావడంతో రెండవ సినిమా కూడా బ్లాక్ బస్టర్ హీట్ అవుతుందని అంచనాలు ఉన్నాయి. అయితే గతంలో కన్నడలో తెరకెక్కిన ఉగ్రం సినిమాకి ఈ సినిమా రీమేక్ అనే ప్రచారం జరుగుతూ ఉండగా ఆ విషయం మీద మాత్రం ఇప్పటివరకు అధికారిక క్లారిటీ అయితే లేదు. ఒకసారి ప్రమోషన్స్ ప్రారంభించిన తర్వాత క్లారిటీ వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

## నేడు సిఎస్ఐ సనాతన్ ట్రైలర్ విడుదల

హిట్లు, ఫ్లాప్‌లతో సంబంధంలేకుండా వరుసగా సినిమాలతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుంటాడు ఆది సాయికుమార్. ఈ ఏడాది ఇప్పటికే ఈయన నటించిన మూడు సినిమాలు విడుదలైయ్యాయి. ప్రస్తుతం ఈయన అరడజను సినిమాలను సెట్స్ పైన ఉంచాడు. అందులో 'సిఎస్ఐ సనాతన్' ఒకటి. శివశంకర్ దేవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఇక ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన పోస్టర్లు, టీజర్ సినిమాపై మంచి బజ్‌నే క్రియేట్‌చేశాయి. కాగా తాజాగా మేకర్స్ ఈ సినిమా ట్రైలర్ డేట్‌ను ప్రకటించింది. ఈ సినిమా ట్రైలర్‌ను ఫిబ్రవరి 10న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇక ఈ సినిమాను మార్చి 10న ప్రేక్షకులు ముందుకు తీసుకు రానున్నట్లు ఇటీవలే తెలిపింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో




## మైత్రీ మూవీస్ మరో సంచలనం

### అమిగోస్‌తో వస్తున్న నిర్మాణ సంస్థ

ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యధిక బిజీగా ఉన్న నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'అమిగోస్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నది. కళ్యాణ్‌రామ్ త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ సినిమాకు రాజేంద్ర రెడ్డి దర్శకత్వం వహించాడు. ఇప్పటి వరకు రిలీజైన పాటలు, ట్రైలర్ సినిమాపై ఎక్కడలేని బజ్ క్రియేట్ చేశాయి. రక్త సంబంధం లేకుండా ఒకే పోలికలతో ఉన్న ముగ్గురు వ్యక్తుల కలుసుకోవడం.. అసలు ఆ ముగ్గురు ఎందుకు కలుసుకోవాల్సి వచ్చింది. కలుసుకున్న తర్వాత వాళ్ల జీవితాల్లో ఎలాంటి పరిణామాలు ఎదురైయ్యాయి వంటి పలు అంశాలతో సినిమాపై మంచి ఆసక్తి క్రియేట్ చేశారు. పైగా అందులో ఒకటి నెగెటీవ్ పాత్ర అవడంతో ప్రేక్షకులలో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. దానికి తగ్గట్టే మైత్రి మూవీస్ కూడా భారీగా ప్రమోషన్లు చేస్తూ జనాల్లోకి సినిమాను బాగానే తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పైగా పోటీగా చెప్పుకోదగ్గ సినిమాలేవి లేకపోవడంతో కాస్త పాజిటీవ్ టాక్ తెచ్చుకున్నా మరో బింబిసార అయ్యే చాన్స్ ఉంది. అంతేకాకుండా ఈ సినిమాకు బిజినెస్ కూడా పెద్ద చెప్పుకోదగ్గ స్థాయిలో ఏమి జరుగలేదు. బింబిసార కంటే మూడు కోట్లు తక్కువగానే అంటే 12కోట్ల బిజినెస్ మాత్రమే జరిగింది. ప్రస్తుతం ఈ సినిమాకున్న హైప్‌ను బట్టి చూస్తే ఫస్ట్ వీకెండ్ పూర్తయ్యే లోపే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకునే చాన్స్ ఉంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in